24/7 నాణ్యమైన విద్యుత్

- పనుల పురోగతిలో ఏపీఈపీడీసీఎల్ ముందంజ
- జోన్-2 పరిధిలో సబ్ స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు
- 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో రూ.4.19 కోట్లతో పనులు
- పరిశ్రమలు, గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు


తుప్పు పట్టిన స్తంభాన్ని తొలగించి, కొత్తది వేస్తున్న సిబ్బంది


కేవీ లైన్ల స్తంభాల తీగలను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

కంచరపాలెం: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చర్యలు చేపట్టింది. కంచరపాలెం జోన్-2 డివిజన్ పరిధిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పనులు చేపట్టింది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన విద్యుత్ తీగల ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.4.19 కోట్లు నిధులతో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆదేశాలతో కంచరపాలెం జోన్-2 డివిజన్‌లోని 4 సబ్‌డివిజన్ (కంచరపాలెం, ఆటోనగర్, మల్కాపురం, గాజువాక)లకు చెందిన 13 అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయ ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. పరిశ్రమలు, గృహ వినియోగదారులకు 24/7 నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు జోన్-2 అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుత విద్యుత్ సరఫరా, పంపిణీ సామర్థ్యం, భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు జోన్-2 పరిధిలోని సబ్ స్టేషన్ల మరమ్మతు పనులు చేపట్టినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కోటేశ్వర నాయుడు తెలిపారు.

జోన్-2 లోని 4 సబ్ డివిజన్లలో 13 సెక్షన్లలో పనులకు మంజూరైన నిధులు

సబ్ డివిజన్ కార్యాలయం	నిధులు
ఆటోనగర్	రూ.48.12 లక్షలు
చినగంట్యాడ	రూ.23.08 లక్షలు
గాజువాక	రూ.30.05 లక్షలు
కంచరపాలెం	రూ.25.84 లక్షలు
మల్కాపురం	రూ.28.00 లక్షలు
మర్రిపాలెం	రూ.37.47 లక్షలు
మింది	రూ.36.93 లక్షలు
మురళీనగర్	రూ.44.10 లక్షలు
ఎన్ఎస్‌టీఎల్	రూ.34.58 లక్షలు
పెదగంట్యాడ(రూరల్)	రూ.13.65 లక్షలు
పెదగంట్యాడ(అర్బన్)	రూ.17.70 లక్షలు
శ్రీహరిపురం	రూ.39.13 లక్షలు
వడ్లపూడి	రూ.40.39 లక్షలు
మొత్తం	రూ.4.19 కోట్లు

మూడు నెలలుగా చకచకా పనులు

జోన్-2 డివిజన్ పరిధిలోని 13 సెక్షన్ల పరిధిలో విద్యుత్ పనులు చకచకా జరుగుతున్నాయి. పాడైన 33 కేవీ, 11 కేవీ మరియు ఎల్‌టీ విద్యుత్ ఇనుప స్తంభాలు, పాత వైర్లను మార్పు చేస్తున్నారు. రోడ్ క్రాసింగ్ వద్ద స్తంభాల ఎత్తు పెంచడం, ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ వైర్లను సరిచేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులను మార్చడం, విద్యుత్ లైన్లకు అతిదగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, సబ్‌స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నాయి. జనవరి 31నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా మూడు నెలలుగా అధికారులు పనులు చేపట్టారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు



విద్యుత్ ప్రమాదాలను నివారించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గి వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.4.19 కోట్లు మంజూరు చేసింది. జోన్-2 డివిజన్‌లోని 13 సెక్షన్లలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ, సహకరించాలి.

– బి.కోటేశ్వరనాయుడు, జోన్-2 ఈఈ, ఏపీఈపీడీసీఎల్

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సీఎం సారథ్యంలో నియోజకవర్గాన్ని అన్ని విధాల ఆదర్శవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని నడుపూరు రామాలయం వీధి, సచివాలయం పక్కవీధిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిశారు. వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. తొందరలోనే విశాఖ నుంచి పాలన సాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, తాటికొండ జగదీష్, ప్రమీల, కాకినాడ పెంటారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అదానీకి ఇచ్చిన ప్రాజెక్టులపై విచారణ చేపట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

గాజువాక : ఆంధ్రప్రదేశ్‌లో అదానీకి ఇచ్చిన ప్రాజెక్టులపై ఇక్కడి ప్రభుత్వం విచారణ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గాజువాకలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అదానీకి ఇచ్చిన మొత్తం ప్రాజెక్టులపై న్యాయ విచారణ కూడా చేపట్టాలని, అంతవరకు ఆ ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచాలని అన్నారు. అదాని మొత్తం దేశాన్ని ముంచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎల్‌ఐసీని రూ.18 వేల కోట్లకు, ఎస్‌బీఐని రూ.21వేల కోట్లకు ముంచారన్నారు. ఇది బీజేపీ చేసిన దేశ ద్రోహమని పేర్కొన్నారు. అదాని విషయంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీలు తమ వైఖరిని వెల్లడించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రకటన హర్షణీయం

స్టీల్‌ప్లాంట్ పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతామని బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ ప్రకటించడం హర్షణీయమన్నారు. అయితే, పార్లమెంట్ సమావేశాల కోసం కేంద్ర ప్రభుత్వానికి ఆ పార్టీ ఇచ్చిన నోట్‌లో ప్లాంట్ విషయాన్ని చేర్చకపోవడంపై తమకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఆ నోట్‌లో రైల్వే జోన్ ప్రస్తావన లేదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావించలేదని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్పందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం, గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు పాల్గొన్నారు.

గాజువాక పరస పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉత్సవ కమిటీ

గాజువాక : ఫిబ్రవరి 2న నిర్వహించనున్న శ్రీ సీతారామ ఉమా రామలింగేశ్వరస్వామి పరస (గాజువాక పరస) పోస్టర్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులకు పరస నిర్వహణపై వివిధ సూచనలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని గాజువాక పరసను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా మిగిలిన నిధులు, పరస నిర్వాహక కమిటీ సభ్యుల సొంత నిధులతో కార్యక్రమాన్ని జరపనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నర్సింహ పాత్రుడు, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ మద్ది శంకరరెడ్డి, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ధర్మాల శ్రీను, లంక లత, గోమాడ వాసు, షౌకత్ అలీ, గొందేశి మహేష్‌రెడ్డి, మద్దాల అప్పారావు, ఇరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త చరిత్రకు నాంది ఉక్కు ఉద్యమం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 719వ రోజుకు రిలే దీక్షలు


దీక్షలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: దేశంలో సరికొత్త చరిత్రకు విశాఖ ఉక్కు ఉద్యమం నాంది పలకనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక వర్గం తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 719వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఈఎస్ఎఫ్, ఈఆర్‌సీ, సేఫ్టీ, టిక్ సెల్ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, మరీ ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం పదే పదే చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేసిన ఉక్కు కార్మికులు, నిర్వాసితులకు, అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అప్పారావు, ఆర్.రామారావు, వి.వెంకటేష్, కె.శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత


బీమా సొమ్మును అందజేస్తున్న నర్సింహ పాత్రుడు

గాజువాక : ఆపదలో ఉన్న కుటుంబానికి వైఎస్సార్ బీమా ఆసరాగా ఉంటుందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. సంజీవగిరి కాలనీలో సిరిపురపు సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు విడుదలైన వైఎస్సార్ బీమా సొమ్ములో తక్షణ సాయంగా రూ.10వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకంలో మూడు వేల జబ్బులను చేర్చారన్నారు. పేద ప్రజలు ఎవరైనా జబ్బులబారిన పడి మృతి చెందితే వారి కుటుంబాలను వైఎస్సార్‌బీమా ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గణేష్, బెన్విశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రజాగర్జన విజయవంతం

పెదగంట్యాడ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉక్కునగరం త్రిష్ణ మైదానంలో సోమవారం నిర్వహించిన ప్రజా గర్జన విజయవంతమైందని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ తెలిపారు. పెదగంట్యాడ జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభను విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణం.. కమనీయం


గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి, కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలో అభివృద్ధి పనులు ప్రారంభం


ఆస్పత్రి సెక్యూరిటీ క్యాబిన్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం డాక్టర్ ప్రకాశ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో అభివృద్ధి పనులను ఆస్పత్రి చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ ప్రారంభించారు. జనరల్ ఆస్పత్రికి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారుల ప్రవేశ, నిష్క్రమణల వద్ద హోంగార్డులు ఉండి ట్రాఫిక్‌ను నియంత్రిస్తుంటారు. ఎండ, వానల్లో ఆరుబయటే విధులు నిర్వర్తిస్తున్న వారి ఇబ్బందిని గమనించిన ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్లాంట్‌కు చెందిన సీఎంఎం విభాగం సహకారంతో ఇరువైపులా సెక్యూరిటీ క్యాబిన్లు ఏర్పాటు చేశారు.

సెక్షన్ యూనిట్ సిద్ధం

ఆస్పత్రిలోని బెడ్‌ల వద్దకు ఆక్సిజన్ సరఫరా చేసే సెక్షన్ యూనిట్‌ను పునరుద్ధరించారు. కొద్ది నెలలుగా ఈ యూనిట్ పనిచేయడం లేదు. బయటి వారు మరమ్మతులకు రూ. 2.5 లక్షలు అవుతుందని చెప్పగా, ఉన్న వనరులను వినియోగించి కేవలం రూ. 30 వేలతో సెక్షన్ యూనిట్‌ను సిద్ధం చేశారు. ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ మాట్లాడుతూ సొంత వనరులను వినియోగించడం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ మేనేజర్ ఎ.క్రాంతి కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి జీఎం డాక్టర్ సారంగి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ వరలక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి కొండయ్యవలస,. పరిసర నిర్వాసిత కాలనీల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ పూజలు చేయించారు, మొక్కులు చెల్లించారు. అమ్మవారికి చీర, సారె, గాజులు కానుకగా సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి పాల్గొని విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు ప్రసాద్, గ్రామపెద్దలు పిల్లా కొండలరావు, బలిరెడ్డి శ్రీను, విందుల వరహాలు, దాసరి సత్యవేణి కొచిపాటి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


ప్రతిజ్ఞ చేస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

అగనంపూడి: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం తోపాటు మనసు ఆహ్లాదంగా, సంతోషంగా ఉంటుందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం పరిసరాలకు కూడా ఇవ్వడం ద్వారా స్వచ్ఛమైన కళాశాల, స్వచ్ఛమైన గ్రామం, దేశం చూడవచ్చన్నారు. తరువాత జాతీయ పరిశుభ్రతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ పీవో సుందర్‌రామం, కో–ఆర్డినేటర్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ ఊరేగింపులో ఉత్సవమూర్తులు


కలశాలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ కూడలిలో ప్రసన్న వేంకటేశ్వరుడు కొలువైన ప్రసన్న గిరి ప్రదక్షిణ మంగళవారం వైభవంగా జరిగింది. మేళతాళాలతో, కోలాటం నడుమ, భజనలు, గోవింద నామస్మరణతో భక్తులు గిరిప్రదక్షిణ చేపట్టారు. భక్తులు మూడు పర్యాయములు గిరిప్రదక్షిణ చేసిన అనంతరం స్వామికి ఆలయంలో విశేష పూజలు చేశారు. గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ గంట్రెడ్డి రామునాయుడు, సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

షిర్డీ సాయి ఆలయ వార్షిక వేడుక


ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. సాయిబాబాకు పంచామృతాభిషేకం, విభూది అభిషేకం, ఆలయంలో గాయత్రీ హోమం నిర్వహించారు. విశాఖకు చెందిన నృత్యాంజలి అకాడమీ గురువులు పి.రమ్య, లక్ష్మి ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. బాలలు బాబా వేషధారణలో అలరించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఢిల్లీ అధికార ప్రతినిధి పి.రఘురామ్, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, కె.ప్రసాద్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి సహకరించాలని వినతి


సుబ్బారెడ్డిని సత్కరించిన కార్పొరేటర్ లక్ష్మి

అగనంపూడి: జీవీఎంసీ విలీన గ్రామాలతో ఏర్పడిన 85వ వార్డు అభివృద్ధికి సహకారం అందించాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కోరారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో సుబ్బారెడ్డిని కలిశారు. ఫార్మాసిటీ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, కాలనీలను అభివృద్ధి చేయాలని, మేజర్ సన్స్‌కు పట్టాలివ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకుడు ఇల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ రాజధాని కోసం తిరుమలలో పూజలు


తిరుమలలో పూజలు చేసిన పూర్ణ తదితరులు

అగనంపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో ఆరు పర్యాయాలు పాలించేలా, విశాఖ రాజధానిగా రాష్ట్రం కీర్తిప్రతిష్ఠలు గడించేలా దీవించాలని తిరుమలలోని వేంకటేశ్వరస్వామికి అగనంపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నాయకులు యలమంచిలి అప్పారావు, పెదిరెడ్ల హరినాథ్, విందుల వరప్రసాద్, గురు గిరీష్, దాసరి సన్యాసిరావు, గల్ల అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీకి వినతి

గాజువాక :జీవీఎంసీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ముఖ హాజరు రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మికుల ముఖ హాజరుకు, జీతాలకు ముడిపెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించకుండా కొత్త నిర్ణయాలను అమల్లోకి తీసుకురావడం అన్యాయమన్నారు. వినతి పత్రం అందజేసినవారిలో నాయకులు గొలగాని అప్పారావు, యజ్జల చిన్నారావు, గొల్ల రాము తదితరులున్నారు.

గ్రహణం మొర్రి బాధితులకు స్క్రీనింగ్ క్యాంపు రేపు

సింహాచలం: పెందుర్తి భవిత కేంద్రంలో గురువారం గ్రహణం మొర్రి, గ్రహణశూల విద్యార్థులకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు విశాఖ జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎ .అబ్దుల్లా ఆశ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సమగ్రశిక్ష , బసవతారకం స్మైల్ ట్రైన్స్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నా రు. ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపు నిర్వహించ డం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే వారికి అవసరమైన ట్రాన్స్‌పోర్టు అలవెన్సులు కూడా ఇస్తామని పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం జిల్లాలో ఉన్న ప్రత్యేక ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా గ్రహణం మొర్రి, గ్రహణశూలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి ఈసమాచారాన్ని వారి తల్లిదండ్రులకు అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛ సంకల్పంపై అవగాహన


విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : స్వచ్ఛ సంకల్పంపై జీవీఎంసీ అధికారులు 70వ వార్డులో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ట్వింకిల్ కిడ్స్ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నివాసులు అందించాల్సిన సహకారాన్ని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, ఇళ్లలో చెత్తను తడి, పొడి, ప్రమాదకర చెత్తగా వేరు చేసి క్లాప్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, పాఠశాల కరస్పాండెంట్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.